క్లుప్తంగా

కరవే అధ్యక్షుడిగా ఆంజనేయులు



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక తాలూకా కర్ణాటక రక్షణ వేదిక (స్వాభిమాన దళం) నూతన అధ్యక్షుడిగా ఆంజనేయులు గురువారం ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆ సంఘం రాజ్యాధ్యక్షుడు పి కృష్ణేగూడ సమక్షంలో ఆయన పదవీ ప్రమాణం చేశారు. ఉపాధ్యక్షుడిగా అక్కులప్ప, ట్రెజరర్‌గా మహబూబ్ బాష, కార్యదర్శిగా రాంబాబు, సంఘటనా కార్యదర్శిగా మధు, పట్టణ విభాగం ఉపాధ్యక్షుడిగా వేణు, సంఘటనా కార్యదర్శిగా మంజునాథ్ పీఎస్, వైఎన్ హొసకోట హోబళి అధ్యక్షుడిగా సందీప్ కుమార్ ఎంపికయ్యారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

చిలమత్తూరు: హిందూపురం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని ఈనెల 29న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్కెట్ ఫీజు వసూళ్లు, తోళ్ల మార్కెట్లు, పరిగి బస్టాండ్ ఖాళీ స్థలానికి బహిరంగ వేలం నిర్వహించేందుకు కౌన్సిల్ ఆమోదం కోసం అత్యవసర సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే 2025–26 బడ్జెట్ ఆమోదం పొందిన నేపథ్యంలో వివిధ శాఖలకు కేటాయించిన నిధుల వివరాలపై చర్చిస్తామన్నారు.

సజావుగా వేలం

లేపాక్షి: స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం 2025–26 సంవత్సరానికి వారపు సంత, బస్టాండ్‌లో ఫీజులు వసూలు హక్కుల కోసం సర్పంచ్ ఆదినారాయణ అధ్యక్షతన వేలం పాట నిర్వహించారు. బస్టాండ్‌లో పార్కింగ్ స్థలంలో ఫీజు వసూలు హక్కులకు నిర్వహించిన వేలం పాటలో పంచాయతీకి రూ.2.31 లక్షల ఆదాయం సమకూరింది. బస్టాండ్‌లో ఫీజులు వసూలు చేయడం కోసం వేలం పాట నిర్వహించగా.. అందులో 11 మంది వేలం పాటదారులు పాల్గొన్నారు. లేపాక్షికి చెందిన గోవిందప్ప రూ.34.56 లక్షలకు దక్కించుకున్నారు. వారపు సంతకు వేలం పాట నిర్వహించగా.. ఇందులో ముగ్గురు పాల్గొనన్నారు. లేపాక్షికి చెందిన నయాజ్ రూ.2.12 లక్షలకు వారపు సంతను దక్కించుకున్నారని ఈఓఆర్డీ ఆనందకుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి సాయిప్రసాద్, ఎస్ఐ నరేంద్ర, పోలీసు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీ కార్యాలయంలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ గంగాదేవి దుస్తులు పాతరక్షలు, సబ్బులు, నూనె గురువారం పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవలందిస్తేనే ఎన్నికల్లో టికెట్లు



నూతన మున్సిపల్ సభా ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి వెంకటరమణప్ప

పావగడ: ప్రజలకు సేవలు అందిస్తేనే ఎన్నికల్లో టికెట్ లభిస్తుందని స్థానిక మాజీ మంత్రి వెంకటరమణప్ప స్పష్టం చేశారు. స్థానిక మున్సిపల్ ఆవరణలో నూతనంగా నిర్మించిన సభాంగణాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలోని చుట్టు పక్కల ఉన్న ప్రాంతాలలో 5 కిమీ పట్టణం లోకి కలుపు కుంటే మున్సిపాలిటీని నగర పంచాయతీగా అప్ గ్రేడ్ చేయవచ్చని తెలిపారు. సుమారు రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సభాంగణం అసెంబ్లీ భవనాన్ని తలపించేలా ఉందని అన్నారు. ఆభవన నిర్మాణానికి దోహద పడిన మున్సిపల్ అధ్యక్షుడు రాజేశ్‌ను ప్రశంసించారు.

మెడికల్ కిట్ల పంపిణీ

రొళ్ల: మండలంలోని జీబీ హళ్లి, క్యాతప్ప పాళ్యం గ్రామాల్లో బోధకాలు వ్యాధిగ్రస్తులైన గంగమ్మ, పద్మరాజుకు మలేరియా సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా ఆధ్వర్యంలో మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. షమీవుల్లా మాట్లాడుతూ బోధకాల వ్యాధి క్యులెక్స్ అనే దోమ కాటు వేయడం వల్ల ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉందని తెలిపారు. బోధకాల వ్యాధిగ్రస్తులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతా ఆర్భాటం.. ఏదీ సుందరం!

- మడకశిరలో సుందరీకరణ పనులు ప్రారంభించని కూటమి సర్కారు
- డివైడర్లపై గడ్డి, పిచ్చి మొక్కలు తొలగించి చేతులు దులుపుకున్న వైనం
- సుందరీకరణ పనులకు ప్రత్యేక నిధులు కేటాయించిన ప్రభుత్వం
- సాధారణ, స్టాంప్ డ్యూటీ నిధులతోనే సరిపెట్టేందుకు యత్నం



మడకశిర పట్టణంలో డివైడర్లపై కనిపించని మొక్కలు

మడకశిర: మడకశిర సుందరీకరణ (బ్యూటిఫికేషన్) కూటమి ప్రభుత్వ ఆరంభ శూరత్వంగానే మిగిలింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన వెంటనే పట్టణ సుందరీకరణపై నాయకులు హడావుడి చేశారు. సుందరంగా మారుతుందని ప్రజలు ఆశించారు.. అయితే పట్టణ ప్రజల ఆశలు అడియాశలయ్యాయి. ప్రారంభంలో డివైడర్లపై గడ్డి,పిచ్చి మొక్కలు అరకొరగా తొలగించి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటై తొమ్మిది నెలలు పూర్తయినా సుందరీకరణ పనుల్లో ఎలాంటి పురోగతి లేదు.

మడకశిర మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులు ఉన్నాయి. 27వేల జనాభా ఉంది. రూ.2.20 కోట్లతో సుందరీకరణ పనులకు అధికారులు చర్యలు తీసుకున్నారు. గడ్డి,పిచ్చి మొక్కలు తొలగించారు. అయితే నిధుల సమీకరణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధానంగా మున్సిపాలిటీ పరిధిలో ఇళ్ల స్థలాలు, భూములు, ఇళ్లు, ఇతర ఆస్తుల అమ్మకాలు, కొనుగోళ్లు జరుగుతుంటాయి. ఆస్తుల అమ్మకాలు, కొనుగోళ్లను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఇలా రిజిష్టర్ చేసుకునే ఆస్తులకు స్టాంప్ డ్యూటీ చెల్లించాల్సి ఉంటుంది. ఈస్టాంప్ డ్యూటీ ప్రభుత్వ ఖజానాలో జమవుతుంది. ఇలా స్టాంప్ డ్యూటీ ద్వారా ప్రభుత్వ ఖజానాలో జమయ్యే నిధుల్లో కొంత మేర మున్సిపాలిటీలకు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా మున్సిపాలిటీకి వచ్చిన నిధుల్లో సుందరీకరణ పనులు చేపట్టాలని మున్సిపల్ అధికారులు భావించారు. అయితే ఈనిధులు మడకశిర మున్సిపాలిటీకి ఇంత వరకూ జమ కాలేదు.

ప్రత్యేక నిధుల కేటాయింపు..

మడకశిర పట్టణాన్ని సార్వత్రిక ఎన్నికల సందర్భంలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని కూటమి నాయకులు ప్రకటించారు. అయితే సుందరీకరణకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులను తీసుకురావడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారు. సుందరీకరణ పనులకు పైసా నిధులు కూడా కేటాయించలేదు. కేవలం మున్సిపాలిటీకి వచ్చే ఆదాయంపైనే ఆధారపడింది. అయితే మున్సిపాలిటీలో ఆ స్థాయిలో నిధులు లేవు.

బ్యూటిఫికేషన్ కోసం రోడ్ల విస్తరణ

మడకశిరను సుందరంగా తీర్చిదిద్దడానికి రోడ్లను విస్తరించారు. 2014–19లో టీడీపీ హయాంలోనే రోడ్ల విస్తరణ పనులు చేట్టారు. ఎంతో మంది పేదలు రోడ్ల విస్తరణలో నష్టపోయారు.అప్పట్లో బాధితులకు పరిహారం కూడా ఇవ్వలేదు. నష్ట పరిహారం ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి.

భూమిపూజ చేసి, గడ్డి తొలగించారు..

మడకశిర పట్టణాన్ని సుందరంగా తయారు చేస్తామని కేవలం కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పనులను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రారంభించారు. వైఎస్సార్ సర్కిల్ సమీపంలోని డివైడర్ వద్ద ఈపనులకు భూమి పూజ చేశారు. డివైడర్లపై పెరిగిన గడ్డి, పచ్చి మొక్కలను తొలగించి చేతులు దులుపుకున్నారు. సుందరీకరణ జరిగితే పట్టణంలోని అమరాపురం, మధుగిరి, పావగడ, పెనుకొండ, హిందూపురం రోడ్లకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటవుతుంది. డివైడర్లపై ప్లాంటేషన్ చేయాలి.

సుందరీకరణ చేయాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి 9 నెలలు గడిచింది. ఇంత వరకూ పనులను ప్రారంభించలేదు. ప్రారంభంలో కూటమి ప్రభుత్వం సుందరీకరణ పనులపై హడావుడి చేసింది. ఆ తర్వాత పనులు జరగలేదు. ప్రజల ఆశను నెరవేర్చాలి.

– ధను, మడకశిర

ప్రత్యేక నిధులు కేటాయించాలి



పట్టణ సుందరీకరణ పనులకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించాలి. అరకొర మున్సిపల్ నిధులతో సుందరీకరణ పనులను పూర్తి చేయడం సాధ్యం కాదు. ప్రభుత్వం మడకశిర మున్సిపాలిటీ ఆర్థిక పరిస్థితి దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక నిధులు కేటాయించాలి.

– గోపి, మడకశిర

పనుల్లో తీవ్ర జాప్యం



పట్టణ సుందరీకరణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. సుందరీకరణ పనులు ప్రారంభించి, మాట నిలబెట్టుకోవాలి. మున్సిపాలిటీకి నిధులు అందించి కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి. అధికార పార్టీ నాయకులు కూడా ప్రత్యేక నిధులు సాధించడానికి కృషి చేయాలి.

– నగేష్, మడకశిర

సర్వసభ్య సమావేశంలో అధికారుల నిలదీత



రొళ్లలో నిర్వహిస్తున్న సర్వసభ్య సమావేశం

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో గురువారం నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో అధికారులను సభ్యులు నిలదీశారు. ఎంపీపీ కవిత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సభకు జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుతం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను పంచాయతీ స్థాయి ప్రజా ప్రతినిధులకు తెలపకుండా ఇష్టాను సారంగా పథకాలను అందిస్తున్నారని నిలదీశారు. ఉపాధి ద్వారా పండ్లతోటల పెంపకం మొదలుకొని గోకులంషెడ్లు, ఇళ్ల మంజూరు వంటి ఇతరాత్ర పథకాలు గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులకు తెలియజేయకుండా కేవలం అధికార పార్టీ నాయకులు సూచించిన వారికి మాత్రమే అందిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు రత్నమ్మ, నాగరాజు, తహసీల్దార్ షేక్షావలి, ఎంపీడీఓ రామరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి సారించాలి



పరిగి: మాట్లాడుతున్న హిందూపురం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్య



సోమందేపల్లిలో మాట్లాడుతున్న జడ్జి ముజిబ్ ఫసల్



మడకశిరరూరల్: చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి ఆర్.అశోక్‌కుమార్

పరిగి: పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని హిందూపురం ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్య సూచించారు. కేవలం విద్యాసంస్థలకు పంపి చేతులు దులుపుపోకుండా ఎప్పటికప్పుడు వారి నడవడికపై తెలుసుకోవాల్సిన బాధ్యత ఉంటుందన్నారు. గురువారం పరిగి మండలంలోని ధనాపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో లైంగిక వేధింపులు, వివాహాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. తహసిల్దార్ హసీనా సుల్తానా అధ్యక్షతన జరిగిన సమావేశంలో న్యాయమూర్తి రమణయ్య మాట్లాడుతూ, పిల్లల్లో సెల్ ఫాన్ వాడకం పెచ్చు పెరిగిపోయిందని, తద్వారా పిల్లలు మంచి కంటే చెడు విషయాలకే ఆకర్షితులవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఆడపిల్లలకు మంచి, చెడు స్పర్శలపై తల్లులు ప్రత్యేక అవగాహన కల్పించాలన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకున్నప్పుడే సమాజంలో జరిగే వివిధ అంశాలపై చైతన్యం వస్తుందన్నారు. కొత్త వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇందాద్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, ఏఎస్ఐ వెంకటేశులు, న్యాయవాదులు సుదర్శన్, రవిచంద్ర, మురళి, ఈశ్వరప్ప, ఏసీఎం రామేశ్వరరెడ్డి, పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

సోమందేపల్లి: విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి ముజిబ్ ఫసల్ విద్యార్థులకు సూచించారు. గురువారం సాయంత్రం కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. జడ్జి మాట్లాడుతూ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే పోక్సోలాంటి కఠినమైన చట్టాలు ఉన్నాయన్నారు. బాల్యవివాహాలు నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు పాటుపడాలని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది శ్రీరాములు, ఎస్ఓ అనీత, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ తదితరులు పాల్గోన్నారు.

మడకశిరరూరల్: విద్యార్థినులు విద్యతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి ఆర్ అశోక్‌కుమార్ కోరారు. గురువారం సాయంత్రం గుండుమల కేజీబీవీ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థినులు చెడు అలవాట్లుకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్ బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ ఉదయ పావని, సీఐ నాగేష్‌బాబు, న్యాయవాది గోపినాథ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఈ–కేవైసీ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న అధికారులు

హిందూపురం: రేషన్ లబ్ధిదారులతో ఈనెల 31వ తేదీలోపు ఈ–కేవైసీ వేయించాలని డిప్యూటీ తహసీల్దార్ హారతి, ఆర్ఐ అమర్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఎఫ్‌పీ షాప్ డీలర్స్, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అందరికీ పెండింగ్ లిస్టులు అందజేయడం జరిగిందని తెలిపారు. కార్డులకు ఈ విషయాన్ని తెలియజేసి యుద్ధ ప్రాతిపాదికన ఈ–కేవైసీ పూర్తి చేయాలన్నారు.

రాంపురం ఉప సర్పంచ్‌గా నాగప్ప

పెనుకొండ రూరల్: రాంపురం పంచాయితీ ఉప సర్పంచ్‌గా నాగప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శ్రీదేవి, పంచాయతీ సెక్రటరీ జమీర్ తదితరులు పాల్గొన్నారు.

వారపు సంత వేలం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో గురువారం వారపు సంతకు సంబంధించి వేలం పాటను హరి అనే వ్యక్తి రూ.18,7,00కు, దిన సంతను నరేంద్ర అనే వ్యక్తి రూ.63,500కు దక్కించుకున్నట్లు కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, సర్పంచ్ గంగాదేవి పాల్గొన్నారు.

13న ప్రవేశ పరీక్ష

అమరాపురం: మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏప్రిల్ 6న జరగాల్సిన బీఆర్‌జీ సెట్ ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 13వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రిన్సిపాల్ బీఎస్ పద్మావతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

హరేకృష్ణ కల్చరల్ కేంద్రం నిర్మాణానికి భూమిపూజ



నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక, వేణురెడ్డికి జ్ఞాపికలు అందజేస్తున్న దృశ్యం

చిలమత్తూరు: హిందూపురం పట్టణ పరిధిలోని గుడ్డం ప్రాంతంలో గురువారం ఇస్కాన్ ఆధ్వర్యంలో హరేకృష్ణ కల్చరల్ కేంద్రం నిర్మాణానికి భూమిపూజ చేశారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక, వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, మాట్లాడారు. పట్టణంలో ఇస్కాన్ వారు కల్చరల్ కేంద్రం నిర్మించడం హర్షణీయమన్నారు. ప్రజలను భక్తిభావం వైపు నడిపేందుకు ఇస్కాన్ కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఎ శివ, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు మహేష్ గౌడ్, జిల్లా కార్యదర్శులు దిలీప్ కుమార్, తిప్పేరుద్రయ్య, కౌన్సిలర్లు నాగేంద్ర బాబు, ముద్దిరెడ్డిపల్లి చంద్రోశేఖర్ రెడ్డి, రూరల్ మండల కన్వీనర్ రాము, వైఎస్సార్‌సీపీ నాయకులు ధనుంజయ రెడ్డి, ప్రణయ్‌రెడ్డి, శబరీష్ రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కమిటీ ఎంపిక



విజయ సంకేతం చూపుతున్న న్యాయవాదులు

పెనుకొండ: పెనుకొండ కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం రెండు కమిటీలు ఎంపికయ్యాయి. ఒక కమిటీ అధ్యక్షుడిగా మదనమోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మోహన్ నాయక్, కార్యదర్శిగా క్రిష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీగా శ్రీరాములు, అదనపు జాయింట్ సెక్రటరీగా విశ్వనాథ్‌నాయక్, ట్రెజరర్‌గా రాజేష్‌నాయక్, లైబ్రేరియన్ సెక్రటరిగా అబ్దుల్‌ముజీబ్‌కాన్, ఎగ్జిగ్యూటివ్ మెంబర్లుగా దయానందరెడ్డి, నాగార్జున, నాగేశ్వరి, ధర్మేంద్రరెడ్డి, హరీష్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్ నియమితులయ్యారు. ఏప్రిల్ 1 నుంచి 2026 వరకూ ఈ కమిటీ కొనసాగుతుంది. అదే విధంగా మరో కమిటీలో అధ్యక్షుడిగా వాల్మీకి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా అశ్వర్థనారాయణ, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, జాయింట్ సెక్రటరీగా విక్రాంత్‌నాయక్, ట్రెజరర్‌గా జావీద్‌హుస్సేన్, లైబ్రరీ కార్యదర్శిగా బాలాజీ, సభ్యులుగా నారాయణప్ప, నాగిరెడ్డి, లీలారాణి ఎన్నికయ్యారు. న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తామని ఇరువర్గాల కమిటీ నాయకులు తెలిపారు.

పాస్టర్ ప్రవీణ్ పగడాలకు ఘన నివాళి



పాస్టర్ ప్రవీణ్ కుమార్ మృతికి కొవ్వొత్తులతో సంతాపం తెలుపుతున్న క్రైస్తవులు

హిందూపురం టౌన్: పాస్టర్ ప్రవీణ్ కుమార్ పగడాల కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి, నిజాలను ప్రజలకు తెలియజేయాలని ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్, హిందూపూర్ పాస్టర్ ఫెలోషిప్స్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపం తెలుపుతూ కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. రాజమండ్రి సమీపంలోని కొవ్వూరు టోల్ ప్లాజా వద్ద అనుమానాస్పద స్థితిలో మరణించిన అంతర్జాతీయ క్రైస్తవ మత బోధకుడు పాస్టర్ ప్రవీణ్ కుమార్ పగడాల మరణంపై అనుమానాలు ఉన్నాయన్నారు. కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి క్రైస్తవులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ నాగేంద్ర కుమార్, హిందూపురం పాస్టర్ ఫెలోషిప్ ప్రెసిడెంట్లు డాక్టర్ డేవిడ్, సూర్య ప్రకాష్, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, స్టీఫెన్ రాజ్, ఐజక్ పాల్, మనోజ్ మింటూ, డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానయాత్రలతో విద్యార్థులకు ఉపయోగం



శ్రీహరికోటను సందర్శించిన విద్యార్థినులు

హిందూపురం టౌన్: విజ్ఞాన శాస్త్ర పరిశోధనలు విద్యార్థుల్లో ఆసక్తిని పెంచుతాయని స్థానిక ఎస్‌ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులను గురువారం శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష పరిశోధన సంస్థ, తిరుపతిలోని భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ సందర్శనకు తీసుకెళ్లారు. భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థలోని ప్రయోగశాలలు, ఆధునిక తరగతి గదులను విద్యార్థినులు సందర్శించారు. విద్యా అకాశాలపై ప్రొఫెసర్లను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇస్రోలోని రాకెట్ లాంచింగ్ ప్యాడ్స్, మిషన్ కంట్రోల్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశులు, రమేష్, సరస్వతి, అశ్వర్థప్ప, సుబ్బరాయుడు, కళావతి, నందిని తదితరులు పాల్గొన్నారు.

సామాన్య కుటుంబం నుంచి ఎంపీపీగా..



ఎంపీపీ నాగమ్మ

రొద్దం: నూతన ఎంపీపీగా ఎన్నికైన నాగమ్మది సామాన్య దళిత కుటుంబం. పెద్దగా చదువు లేకున్నా వ్యవసాయ పనులు చేసుకుంటోంది. భర్త మేస్త్రీ పనులు చేస్తూ.. వ్యవసాయం పనులు చేస్తుంటాడు. ఆమె కూడా వ్యవసాయ పనులు చేస్తుంటారు. వారికి ఇద్దరు కొడుకులు బెంగళూరులో పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గత 2019లో నల్లూరు పంచాయతీ ఎంపీటీసీగా గెలుపొందారు. 14 మంది ఎంపీటీసీల మద్దతు ఉండడంతో ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికయారు.

పశువుల సంతమార్కెట్ వేలం

గుడిబండ: స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం వారపు పశువుల సంత, కూరగాయల మార్కెట్‌తో పాటు దినసరి బస్టాండ్ సుంకం వసూలు కోసం బహిరంగా వేలాన్ని సర్పంచ్ కరుణాకర్‌గౌడు ఆధ్వర్యంలో నిర్వహించారు. వారపు పశువుల సంత మల్లేష్ రూ.6,70,200, కూరగాయల సంత మార్కెట్ రూ.2,81,000, దినసరి బస్టాండ్ సుంకం నటరాజు రూ.2,05,000 వేలం పాటలో దక్కించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగాధర్, ఈఓఆర్డీ నాగరాజు నాయక్, డీటీ కల్యాణచక్రవర్తి, పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న దేవిరమ్మ

అమరాపురం: గ్రామాల్లో రైతులు పకృతి వ్యవసాయం చేయడం ద్వారా అధిక దిగుబడి పొందొచ్చని ఏఈఓ అమర్నాథ్, రమేష్ తెలిపారు. గురువారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో వ్యవసాయం, ఉద్యాన, సెరికల్చర్, సెర్ప్ సంయుక్తంగా రాబోవు ఖరీఫ్‌లో ఎలాంటి ప్రణాళిక తయారు చేయాలనే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా దేవిరమ్మ, అమర్నాథ్ మాట్లాడుతూ రైతులు తమ పంటలకు రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. జీవామృతం ఏవిధంగా తయారు చేసుకోవాలి, వాటి వల్ల కలిగే ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం ముత్యాలప్ప, వీఓఏలు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

మడకశిర: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గురువారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. హైదరాబాద్‌లో ఇజ్రాయిల్ అనే న్యాయవాది దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. స్థానిక న్యాయవాదులు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశ్వత్థ నారాయణ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి, నిరసన తెలిపారు. మూడు రోజుల పాటు తమ విధులను బహిష్కరించినట్లు ఆయన తెలిపారు. న్యాయవాదిని హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అశ్వత్థనారాయణ, ఉమేష్‌చంద్ర కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు గోవర్ధన్‌రెడ్డి, క్రిష్టప్ప, రాధాక్రిష్ణ, ఉమేష్‌చంద్ర, రంగనాథ్, క్రిష్టప్ప, దివాకర్, నాగరాజు, జయరాం తదితరులు పాల్గొన్నారు.

కల్లుమర్రి ఉప సర్పంచ్‌గా నరసన్న



ఉపసర్పంచ్ నరసన్నకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు

మడకశిరరూరల్: కల్లుమర్రి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక గురువారం ప్రశాంతంగా జరిగింది. ఒకటో వార్డు సభ్యుడు కేపీ నరసన్నను ఉప సర్పంచ్‌గా వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో ఉన్న ఉప సర్పంచ్ రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక జరిగింది. సర్పంచ్ గంగమ్మతో పాటు 11 మంది సభ్యులు ఎన్నికలో పాల్గొన్నారు. ఎంపీడీఓ సోనిబాయి, ఆర్ఓ నాగరాజ్‌నాయక్ ఎన్నికైన ఉప సర్పంచ్ నరసన్నకు ధ్రువీకరణ పత్రం అందించారు. సీఐ నగేష్‌బాబు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికను ట్రైనీ డీఎస్పీ ఉదయ పావని పర్యవేక్షించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వరదరాజులు, అధికారులు పాల్గొన్నారు.

రీ సర్వేపై గ్రామసభ

లేపాక్షి: మండల కేంద్రంలోని సచివాలయం–2 వద్ద గురువారం ఉదయం భూముల రీ సర్వేపై రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి మాట్లాడుతూ.. రీ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో గ్రామసభ ఏర్పాటు చేశామని తెలిపారు. భూముల రీ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. స్థానిక సిబ్బందిని సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. అంతకు ముందు రీ సర్వేపై అవగాహన ర్యాలీ చేపట్టారు.

30న కవి సమ్మేళనం

హిందూపురం: స్థానిక ఆర్‌పీటీటీ రోడ్డులోని అల్‌హిలాల్ పాఠశాల ఆవరణలో ఈనెల 30వ తేదీన సాయంత్రం 5:30 గంటలకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. జేవీవీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఈటి.రామ్మూర్తి గురువారం వెల్లడించారు.

వైభవంగా దేవుళ్ల ఊరేగింపు



రాచెర్లప్ప, ముస్టెల్లప్ప విగ్రహాల ఊరేగింపు

పావగడ: తాలూకాలోని నాగలమడక హోబళికి చెందిన రాయచెర్లులో వెలసిన గుడికట్టు కురుబల ఆరాధ్య దేవుళ్ల రాచెర్లప్ప, ముస్టెల్లప్ప నూతన విగ్రహాలను గురువారం ఊరేగించారు. అంతకుముందు బుధవారం దేవుళ్లను బత్తలపల్లి మండలంలోని కాటమయ్య కొండకు తరలించారు. అక్కడ దేవుళ్లకు జలధి పూజలు చేశారు. రాత్రి 12 గంటల తర్వాత గంగపూజ చేశారు. అనంతరం కాటమయ్య కొండ చుట్టూ ప్రదిక్షణ చేసి దేవుళ్లను ఊరేగించారు. అనంతరం ఆ దేవుళ్లను రాయచర్లు గ్రామంలోని కనకదాసు ఆలయంలో గురువారం భద్రపరిచారు. ఏప్రిల్ నెల 18, 19 తేదీల్లో నూతన రాచెర్లప్ప, ముస్టెల్లప్ప ప్రతిమలను స్థానిక కనకదాసు ఆలయంలో ప్రతిష్ఠించనున్నట్లు భీర లింగేశ్వర రాచెర్లప్ప, ముస్టెల్లప్ప అభివృద్ధి ట్రస్ట్ చైర్మన్ సాంబ సదాశివరెడ్డి తెలిపారు.